క్లుప్తంగా

ఆస్పత్రికి వృద్ధుడి తరలింపు



వృద్ధుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఏయూక్యాంపస్: పెదవాల్తేరులో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వెంకటరావు అనే వృద్ధుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గత కొంత కాలంలో వెంకటరావుకు కాలుకు గాయమై తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. స్థానికుల దీనిని గమనించి శనివారం ఉదయం అతనిని కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స తీసుకుని కోలుకున్న తరువాత జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహానికి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో దశరథరామయ్య, 20వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ముర్వల సురేష్, నీలరెడ్డి, చిన్నిపల్లి లక్ష్మణ బాబు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్ల శిక్షణపై ఆరా



డిపో సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు

మద్దిలపాలెం: సురక్షిత ప్రయాణానికి ప్రజా రవాణా వ్యవస్థ లక్ష్యంగా ప్రతి ఒక్క డ్రైవర్, కండక్టర్ విధులు నిర్వహించాలని ఏపీ ప్రజా రవాణా వ్యవస్థ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ అప్పలనాయుడు అన్నారు. మద్దిలపాలెం సిటీ డిపోను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా డిపోలో డ్రైవర్ల, కండక్టర్ల విధులు నిర్వహణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా రవాణా వ్యవస్థను ఆశ్రయించే ప్రతి ఒక్క ప్రయాణికుడు క్షేమం సిబ్బంది బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఇంధన పొదుపు పాటించాలని సూచించారు. సమాజ హితం కోసం సుశిక్షితులైన డ్రైవర్లను తయారు చేయడానికి నిష్ణాతులైన వారితో శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, అసిస్టెంట్ మేనేజర్ బిందు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఉన్నత భవిష్యత్తుకు చదువే మూలం



నృత్య ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు చదువే శక్తివంతమైన ఆయుధమని శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్ వి.షణ్ముఖరావు, కరస్పాండెంట్ కె.సాయి చంద్రికలు అన్నారు. పాఠశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఎంవీపీ కాలనీ లోని పాఠశాల ఆవరణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. చిన్నారుల ఉన్నత భవిష్యత్‌కు, ప్రపంచ ప్రగతికి బాటలు వేసేది చదువు ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మానవ హక్కుల కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్: మానవ హక్కుల కౌన్సిల్ 23వ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్టు కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి అల్లూరి విజ్ఞాన కేంద్రంగా నిర్వహించనున్న సమావేశంలో విశాఖపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బీఎస్ లత, కార్యదర్శి పైలా సన్యాసిరావు, డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బీఎన్ చంద్రకళ, నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎంజే రావును సమావేశంలో సత్కరించనున్నట్టు చెప్పారు.

కైలాసగిరి.. సొగసరి



కైలాసగిరి కొండ పైనుంచి మొదటి మలుపులో నిర్మించిన రోడ్డు



కొత్తగా నిర్మించిన కైలాసగిరి ఘాట్ రోడ్డు

- అద్దంలా రహదారులు
- సందర్శకుల ఆనందం



కొండపై నిర్మించిన రహదారి

ఆరిలోవ: నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రం కైలాసగిరి రోడ్లకు మోక్షం కలిగింది. గత నెలలో జరిగిన జీ–20 సదస్సులో భాగంగా పర్యాటక ప్రాంతాలను వీఎంఆర్‌డీఏ అధికారులు తీర్చిదిద్దారు. విదేశీ అతిథులను ఆకట్టుకునే విధంగా రూపురేఖలు మార్చేశారు. ఇందులో భాగంగా కైలాసగిరి రహదారులు తళతళ మెరిసిపోతున్నాయి. కైలాసగిరి కొండ పైన, కొండపైకి వెళ్లే ఘాట్‌రోడ్డు అద్భుతంగా దర్శమిస్తున్నాయి. దీంతో కై లాసగిరి వచ్చే సందర్శకులకు రహదారులు సౌకర్యవంతంగా మారాయి.

కేబుల్ పనులలో భాగంగా రెండేళ్లుగా ఈ రోడ్లు శిథిలమయ్యాయి. కొండపైన రోడ్డు, శంకు చక్రనామాలు నుంచి తెలుగు మ్యూజియం వరకు రోడ్డు వెడల్పులో సగం భాగం లోతుగా తవ్వేశారు. దానినిన పూర్తి చేయకుండా వదిలేశారు. దీంతో కైలాసగిరిపై ఈ రోడ్డులో సందర్శకులకు నడవడానికి ఇబ్బంది పడేవారు. చాలా సార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. నాలుగు అడుగులు లోతులో తవ్విన ఈ గోతుల్లో పిల్లలు పడిపోతుండేవారు. దీంతోపాటు ఘాట్ రోడ్డులో విశాలాక్షినగర్ వద్ద ప్రవేశ ద్వారం నుంచి కొండపై వరకు తవ్వేశారు. దీంతో రోడ్డు అంతా ఇరుకుగా మారింది. దీనివల్ల కొండపైకి వెళ్లే సందర్శకుల వాహనాలకు ఇబ్బంది కలిగేది. ఓ పక్క కొండ, మరో పక్క కేబుల్ పనులు కోసం తవ్విన లోతైన గోతులు ఉండటంతో సందర్శకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు.

అద్దంలా మెరుస్తున్న రహదారులు

విశాలాక్షినగర్ కూడలి వద్ద ప్రారంభమైన ఘాట్ రోడ్డు నుంచి కొండపైన తెలుగు మ్యూజియం వరకు తారు రోడ్డు నిర్మించారు. కేబుల్ పనులు కోసం తవ్విన లోతైన గోతుల పనులు పూర్తిచేశారు. ఘాట్ రోడ్డంతా మెరుగుపరిచారు. దీంతోపాటు ఘాట్ రోడ్డు పక్కన రక్షణ గోడలకు పెయింటింగ్ వేసి ఆకట్టుకునేలా రూపొందించారు. కొండపైన కేబుల్ పనులు కోసం తవ్విన రోడ్డు కూడా ఆఘమేగాలపై పూర్తి చేశారు. వేంకటేశ్వర స్వామి శంకుచక్ర నామాలు నుంచి తెలుగు మ్యూజియం వరకు తారు రోడ్డు నిర్మించారు. దానికి ఇరుపక్కలా పార్కుల్లో పువ్వుల మొక్కలు, లేన్లు సిద్ధం చేశారు. దీంతో ఈ రోడ్డుపై సందర్శకులకు ఇబ్బందులు తొలగాయి. దీంతో సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తూర్పులో ‘జగనన్నే మా భవిష్యత్తు’



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న అక్కరమాని వెంకటరావు తదితరులు

ప్రభుత్వ పథకాలు వివరించిన హర్షవర్ధన్ రెడ్డి, వెంకటరావు

ఎంవీపీకాలనీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జగనన్నే మా భవిష్యత్తు’, ‘మా నమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని తూర్పు నియోజకవర్గంలో శనివారం విస్తృతంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు పర్యవేక్షణలో 19, 20 వార్డుల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జేసీఎస్ కన్వనర్ హర్షవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 19, 20 వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పనితీరు ప్రజలకు వివరించారు. వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలతో పాటు లబ్ధిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి లబ్ధిదారుడికి పథకాలు అందుతున్నాయన్నారు. ప్రజలకు, రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు. ఆయా పథకాల లబ్ధిదారులు, పెన్షనర్లు జగన్ పాలనపై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నా రు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ ముర్వల లక్ష్మి, 19వ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, పార్టీ ముఖ్యనాయకులు ముర్వల సురేష్, సూరాడ దాసు తదితరులు పాల్గొన్నారు.

మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌పై అనర్హత వేటు



ఉద్యమ పోస్టు కార్డులు ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

దాబాగార్డెన్స్: మోదీని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై వేటు వేశారని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు ఆరోపించారు. నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీకి పంపనున్న ఉద్యమ పోస్టుకార్డులను ప్రదర్శించారు. అనంతరం లక్కరాజు మాట్లాడుతూ మోదీ ప్రియమిత్రుడు అదానీకి రూ. 20 వేల కోట్లు ఎలా వచ్చాయో తెలపాలని ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై కక్ష గట్టారని అన్నారు. దీనిని నిరసిస్తూ పెద్ద ఎత్తున పోస్టు కార్డు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. నగర అధ్యక్షుడు గోవిందరాజు మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీలో చేరడం వల్ల కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం నష్టం లేదన్నారు. పార్టీ నాయకులు వేగి వెంకటేష్, సతీష్, శివ, రామకృష్ణ, చరణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ మృతి దేశానికి తీరని లోటు



చందక గోవింద్‌కు అంజలి ఘటిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: పారాచూట్ శిక్షణలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భారత నావెల్ కమాండో చందక గోవింద్‌కు ఏయూ విద్యార్థులు ఘన నివాళులు అర్పించారు. శనివారం ఏయూ గ్రంథాల యం వద్ద చందక గోవింద్ చిత్రపటానికి విద్యార్థు లు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పర్ల గ్రామానికి చెందిన గోవింద్ ఎంతో ఉన్నతంగా ఎదిగారన్నారు. భారతదేశం గర్వించదగ్గ నావల్ కమాండోగా ఎదిగిన చందక గోవింద్ ఇటీవల జరిగిన పారాచూట్ ట్రైనింగ్ ప్రమాదంలో మృతి చెందడం ఈ ప్రాంతానికే కాకుండా భారతదేశం యావత్తుకు దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. భరతమాత కోసం ప్రాణాలర్పించిన చందక గోవింద్ గారి ఆత్మకు శాంతి కలగాలని, అలాగే వారి కుటుంబ సభ్యులకు ఉత్తరాంధ్ర విద్యార్థి సేన, ఏయూ కుటుంబం తరపున ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ఏయూ ఇంచార్జ్ సుబుద్ధి శ్రీరామ్, విద్యార్థి నాయకులు పట్నాయక్, రమణ, విద్యార్థి సేన నాయకులు సూర్యం, నాని, మహేష్, నాయుడు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నేషనల్ జూ లవర్స్ డే



చిన్నారులకు జంతువుల గురించి వివరిస్తున్న సీతా శ్రీనివాస

బీచ్‌రోడ్డు: ఇందిరా గాంధీ జులాజికల్ పార్క్‌లో శనివారం నేషనల్ జూ లవర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు జూలోని వివిధ రకాల జంతువుల జీవన విధానాన్ని స్టోరీ టెల్లర్ సీతా శ్రీనివాస వివరించారు. జంతువుల అలవాట్లు, ప్రవర్తనను ఎంతో ఆసక్తితో చిన్నారులు తెలుసుకున్నారు. సింహాలు, పులులు, కోతులు మొదలైన వాటి కథలు చిన్నారులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో ఏసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సింగరావు

గాజువాక: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న హనుమాన్ శోభాయాత్రను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శనివారం ఆవిష్కరించా రు. ఆయన మాట్లాడుతూ 15న మధ్యాహ్నం రెండు గంటలకు గాజువాకలో యాత్ర ప్రారంభమవుతుందన్నారు. ఎన్ఏడీ, కరాస మీదుగా బీచ్ రోడ్‌లోని పార్కు హోటల్ వరకు, అక్కడి నుంచి కాళీమాత ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయా లని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి లక్ష్మీనారాయణ, బీజేపీ నాయకులు బాటా శ్రీను, కట్ట పద్మ, పేర్ల అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



తిరువీధి ఉత్సవంలో హనుమత్ సమేత సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలు


అల్లిపురం: బంగారుమెట్ట శ్రీరామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో గత నెల 30వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సీతారాముల ఉత్సవాలు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా హనుమత్, సీతారామలక్ష్మణ విగ్రహాలను తిరువీధి ఉత్సవంగా బంగారుమెట్ట, కుమ్మరవీధి, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో మంగళవాయిద్యాలు, మహిళల కోలాటాలతో సందడిగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా సమాజం అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాజం కార్యవర్గ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

క్లాక్..క్లాప్

- 200 ఏళ్ల కేజీహెచ్ గడియారం
- బ్రిటీష్ కాలంలో ఏర్పాటు
- ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్న అధికారులు



వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా



గడియారం రిపేరు చేయిస్తున్న వాచ్‌మేకర్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ వైపు చూడగానే మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది బ్రిటిష్ కాలం నాటి గడియారం. లండన్ నుంచి తీసుకొచ్చిన ఈ గడియారానికి సుదీర్ఘ చరిత్రే ఉంది. ఆస్పత్రికి మణిహారంలా భాసిల్లే ఈ గడియారాన్ని నాటి బ్రిటిష్ పాలకులు దాదాపు 200 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే అంత పురాతనమైనది అయినా కూడా ఈ గడియారం ఇప్పటికీ పని చేసేలా ఆస్పత్రి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఘన చరిత్ర కలిగిన ఈ గడియారం గతంలో ఒకసారి 40 ఏళ్ల పాటు మరమ్మతులకు గుర్తై తిరగకుండా మొరాయించింది. దీంతో 1985లో ఆస్పత్రి అధికారులు స్థానిక వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్‌కు దీని మరమ్మతు బాధ్యతలు అప్పగించారు. దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్న ఆయన ఆగిపోయిన ఈ గడియారం పనిచేసేలా చేసి అధికారుల మన్ననలు పొందారు. అప్పటి నుంచి గడియారం పర్యవేక్షకుడిగా ఆయనకే బాధ్యతలు అప్పగించారు. గడియారం నిరంతరం పని చేసేందుకు టైమ్ మిషన్లు ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ సమయంలో గడియారంలోని ముల్లు విరిగిపోయాయి. గడియారం కూడా దెబ్బతింది. దీంతో వాచ్‌మేకర్ ఫైజుల్లాఖాన్, ఆయన తనయుడు జఫురుల్లా ప్రత్యేకంగా ముల్లు తయారు చేసి అమర్చారు. ఈ గడియారంలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులోని నిమిషాల ముల్లు పొడవు 4 మీటర్లు, గంటల ముల్లు పొడవు 3.5 మీటర్లు కాగా.. అంకెలన్నీ ఇనుముతో తయారయ్యాయి. చతురస్రాకారంలో గడియారం చుట్టూ గ్లాసమ్ బోర్డు అమర్చారు. రాత్రివేళ కనిపించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గడియారం పర్యవేక్షణకు ఏటా రూ.13 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్ని పెంచాలని వాచ్‌మేకర్ కోరుతున్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కలిగియు వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్యామ్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. అలమేలు మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు తొలి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో భక్తి సంకీర్తన చేపట్టారు.

కలియుగ వెంకన్న ఆలయంలో..

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్



శాస్త్రీయ సంగీతంపై అవగాహన కల్పిస్తున్న ద్వారం త్యాగరాజు, మండపాక శారద

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందని, తిరుమల రామానుజ సూరి స్వరపర్చిన లలిత గీతాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. ముందుగా ద్వారం భావనారాయణ, ద్వారం త్యాగరాజుల విశిష్టతను, గొప్పతనాన్ని సభికులకు పరిచయం చేశారు.

గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలపై శిక్షణ

మురళీనగర్: గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం 5వ తరగతి అర్హత కలిగి చదవడం, రాయడం తెలిసి ఉన్న 18 నుంచి 45 ఏళ్ల వయసు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు, పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా విదేశాల్లోని మతపరమైన సంస్కృతీ సంప్రదాయాలు, వారి జీవన విధానాలు, అలవాట్లు వంటి ముఖ్యమైన అంశాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆయా దేశాల చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాల చెల్లింపు, పనిచేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయభార కార్యాలయం బాధ్యత తీసుకుని తగిన సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తీక్ 94942 02677 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. https://kaushalmahotsav.nsdcdigital.org/International/Candidate/ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చు.

ఈస్టర్ వేడుకలకు సిద్ధం

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా జరుపుకునే పాస్కా (ఈస్టర్) వేడుకలు ఆదివారం జరగనున్నాయి. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారు. గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు రాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటికి వస్తారని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం రక్షణ గిరిలో శనివారం రాత్రి నుంచి జాగరణ, దివ్య పూజాబలులు, ప్రార్థనలు నిర్వహించారు. రక్షకుడైన క్రీస్తును జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇక్కడ దివ్యపూజాబలులు సమర్పిస్తామని సెయింట్ పీటర్స్ పునీత పేతురు ప్రధాన దేవాలయ చర్చి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ తెలిపారు.

పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్

సింహాచలం: పెందుర్తి మండలం పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ ర్యాలీని శనివారం వేపగుంట నుంచి పెందుర్తి జంక్షన్‌లోని ఐసీసీ చర్చి వరకు నిర్వహించారు. వందలాది మంది క్రిస్టియన్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏసు ప్రభువుని నమ్ముకుని జీవించిన వారిని ఆయన నిత్యజీవం అనుగ్రహిస్తాడని పెందుర్తి పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు బి.వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్ రత్నం, కార్యదర్శి బి.జాషువా, ఉపాధ్యక్షుడు కె.కాలేబు, కోశాధికారి యం.దేవకుమార్ పాల్గొన్నారు.